క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు గురువారం విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా జరిపారుర. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: పద్మావతినగర్, అడవివరం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ జోన్‌–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నేపథ్యంలో 98వ వార్డు పరిధిలోని పద్మావతినగర్, షిప్‌యార్డ్ కాలనీ, మైత్రీనగర్, జంగాల కాలనీ, అడవివరం, భైరవవాక తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్, నరవవానిపాలెం, పులగానిపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వార్డుల్లో సుమారుగా రూ.2.25 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరానికి స్పందన



దాతలకు ధ్రువపత్రం అందిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. విమ్స్ రక్తనిధి ప్రతినిధులు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దాతలకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు పెతకంశెట్టి ఉమాశంకర్రావు, కె.నూకరాజు, ఆళ్ల చిరంజీవి, సిరిమళ్ల గణేష్, కారి సూర్యనారాయణ, పెంటకోట గణేష్, విమ్స్ రక్తనిధి ప్రతినిధి కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న ముస్లింలు

పెందుర్తి: నియోజకవర్గంలోని ముస్లింలకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. గురువారం రాత్రి వేపగుంట, చినముషిడివాడ మసీదుల్లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లిం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, ముస్లిం మత పెద్దలు బాబ్జీ, బృహన్, ఖాన్, సైదులు, ఇస్మాయిల్, నాగూర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా కుతంత్రాలు



పెందుర్తి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన ముదపాక శివను అభినందిస్తున్న ఎంపీపీ నాగమణి, వైస్ ఎంపీపీలు చిరికి దేముడు, దాడి వరలక్ష్మి



చింతగట్ల ఉప సర్పంచ్‌గా ఎన్నికైన బొట్టా కనకమహాలక్ష్మితో గండి బాబ్జీ వర్గీయుల సంబరాలు

- నబ్బవరం వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూటమి ప్రలోభాలు, బెదిరింపులు
- పెందుర్తి కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికపైనా రాజకీయ రంగు
- హోరాహోరీ పోరులో చింతగట్ల ఉప సర్పంచ్‌గా బొట్టా కనకమహాలక్ష్మి

పెందుర్తి: ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన పెందుర్తి, సబ్బవరం మండల పరిషత్‌ల వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యుడు, చింతగట్ల ఉప సర్పంచ్ ఎన్నికకు అధికార కూటమి నాయకులు ఉద్దేశపూర్వకంగా రాజకీయ రంగు పులిమారు. అనవసరపు పంతాలకు వెళ్లి ఎంపీటీసీలను మభ్యపెట్టి, బెదిరింపులకు పాల్పడి ఎన్నికను ఉద్రిక్తంగా మార్చే ప్రయత్నం చేశారు. చివరకు వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజారిటీ ఉన్న సబ్బవరం వైస్ ఎంపీపీ స్థానాన్ని కూటమి పెద్దలు ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్రతిపాదించిన కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అయితే ఆఖరి నిమిషంలో మండల పరిషత్ వద్దకు వచ్చిన జనసేన, టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు.

గండి బాబ్జీ వర్సెస్ పంచకర్ల

పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీ వైస్ సర్పంచ్ ఎన్నికను స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పూర్తిగా రాజకీయం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వర్గీయులు, గండి బాబ్జీ అనుచరులు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొనేలా చేశారు. చివరకు ఈ ఎన్నికలో గండి బాబ్జీ వర్గానిదే పైచేయి అయింది. మొత్తం పది వార్డులున్న చింతగట్ల పంచాయతీలో ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవికి గండి బాబ్జీ వర్గానికి చెంది బొట్టా కనకమహాలక్ష్మి, పంచకర్ల వర్గానికి చెందిన దమ్ము సుశీల తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. ఈ క్రమంలో సభ్యులతో ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించగా కనకమహాలక్ష్మికి నలుగురు, సుశీలకు నలుగురు మద్దతు పలికారు. ఈ తరుణంలో కనకమహాలక్ష్మికి సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి మద్దతుగా నిలవడంతో గండి బాబ్జీ వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. వైస్ ఎంపీపీగా కనకమహలక్ష్మి ఎన్నికయినట్లు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ఈవోపీఆర్డీ అప్పలరాజు నియామకపత్రం అందించారు.

కో ఆప్షన్ సభ్యుడిగా ముదపాక శివ

పెందుర్తి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఉన్న నక్కా కనకరాజు ఏడాదిన్నర క్రితం మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దాని కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. రాజయ్యపేట ఎంపీటీసీ సభ్యురాలు(వైఎస్సార్‌సీపీ) ముదపాక దేవి.. ముదపాకకు చెందిన ముదపాక శివను ప్రతిపాదించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి బలపరిచారు. నిర్ణీత సమయంలో ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో శివ కో ఆప్షన్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు పీవో శైషశైలజ సభ్యుల సమక్షంలో ప్రకటించారు. ఎంపీపీ నాగమణి, వైస్ ఎంపీపీలు చిరికి దేముడు, దాడి వరలక్ష్మి, సభ్యులు నందవరపు అప్పలరాజు, గొల్లవిల్లి రమణ, సైపరాజు స్వప్న, ముదపాక దేవి, గండ్రెడ్డి మాలతి, గండి హిమబిందు అభినందించారు. ఎన్నికను ఎంపీడీవో కొల్లి వెంకట్రావు పర్యవేక్షించారు.

తల్లి ఎంపీటీసీ.. తనయుడు కో ఆప్షన్ సభ్యుడు

పెందుర్తి మండల పరిషత్‌కు తల్లీ కొడుకులు ప్రాతినిధ్యం వహించే అరుదైన ఘటన గురువారం చోటుచేసుకుంది. రాజయ్యపేట ఎంపీటీసీ సభ్యురాలుగా ముదపాక దేవి వ్యవహరిస్తుండగా మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఆమె తనయుడు ముదపాక శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో పెందుర్తి మండల పరిషత్ చరిత్రలో తొలిసారి తల్లీ తనయుడు మండల పరిషత్ సర్వసభ్య నిర్ణయాల్లో, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారు.



ఎంపీటీసీ దేవితో తనయుడు కో ఆప్షన్ సభ్యుడు శివ

ఉప సర్పంచ్‌లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సింగంపల్లి దేవిని సత్కరిస్తున్న సర్పంచ్ బోను దేవుడమ్మ తదితరులు

- మల్లునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం ఉప సర్పంచ్‌లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

సబ్బవరం: మండలంలోని గురువారం జరిగిన రెండు ఉప సర్పంచ్ స్థానాల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. మల్లునాయుడుపాలెం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సింగంపల్లి దేవి ఎన్నికయ్యారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికలో వైఎస్సార్‌సీపీకి చెందిన మెజార్టీ సభ్యులు చేతులెత్తడం ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు. గ్రామ సర్పంచ్ బోను దేముడమ్మ, ఎంపీటీసీ సభ్యులు గొర్లి కనకరాజు, పార్టీ సీనియర్ నాయకులు బోను గంగునాయుడుతో వార్డు మెంబర్లు నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్‌ను సత్కరించారు.

• మండలంలోని పైడివాడ అగ్రహారం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు మడక సరోజిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి షేక్ ఫాతిమా తెలిపారు. పంచాయతీలో 10 మంది పాలకవర్గ సభ్యులు ఉండగా సరోజినిని ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఆమె ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నాగలక్ష్మి ప్రకటించారు. సర్పంచ్ వడ్డాది అప్పలరాజుతో పాటు మిగిలిన పాలకవర్గ సభ్యులు సరోజినిని అభినందించారు.

వైస్ ఎంపీపీ–2గా మామిడి లక్ష్మి ఎన్నిక

సబ్బవరం వైస్ ఎంపీపీ–2గా స్వతంత్ర అభ్యర్థి మామిడి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ సమావేశమందిరంలో నిర్వహించిన ఎన్నికలో 11 మంది సభ్యులు పాల్గొని, చేతులెత్తే విధానంలో వైస్ ఎంపీపీని ఎన్నుకున్నారు. గతేడాది చొక్కాకుల గోవింద్ తన పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. 19 మంది సభ్యులకు గాను వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా కె.రమామణి వ్యవహరించారు. ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు ప్రతిపాదించిన లక్ష్మిని, మరో ఎంపీటీసీ బొండా శేషుకుమారి మద్దతు తెలిపారు. సభ్యులు చేతులెత్తి ఆమెకు ఓటేశారు. దీంతో వైస్ ఎంపీపీ–2గా స్వతంత్ర అభ్యర్థి లక్ష్మి ఎన్నికైనట్లు ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు లక్ష్మిని శాలువాతో సత్కరించారు. ప్రస్తుత వైస్ ఎంపీపీ–2తో పాటు, ఆమెకు మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు ఉగాది తర్వాత జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో ఎంపీడీవో పద్మజ, ఏవో శివప్రసాదరావు పాల్గొన్నారు.



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన మడక సరోజినికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి



వైస్ ఎంపీపీ–2గా లక్ష్మిచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి రమామణి

బోదువలసలో కృత్రిమ లేగ దూడల ప్రదర్శన

సబ్బవరం: మండలంలోని బోదివలస గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, విశాఖ, అనకాపల్లి జిల్లాల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి గ్రామ సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. వివిధ జాతులకు చెందిన 42 లేగ దూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలకు చెందిన ప్రతి పాడి రైతుకు ప్రోత్సాహక బహుమతులతో పాటు నట్టల నివారణ మందులు, విటమిన్ టానిక్‌లను అందించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు వైద్యాధికారి డాక్టర్ బి.సంధ్య, మాజీ సర్పంచ్ గంతకోరు సూర్యనారాయణ, అంతకాపల్లి డాక్టర్ జి.అరుణ, ఆరిపాక డాక్టర్ ఎస్.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనలో గ్రామ సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు తదితరులు

ముదపాక శివకు అభినందన



కో ఆప్షన్ సభ్యుడు శివను అభినందిస్తున్న గొర్లె రామునాయుడు

పెందుర్తి: స్థానిక మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన ముదపాక శివను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు గురువారం అభినందించారు. మండల పరిషత్ కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, నాయకుడు మధుపాడ అంజి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన



సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ ఎదుట నిరసనలో కార్మికులు

పరవాడ: ఫార్మాసిటీలోని సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుట సిటు ఆధ్వర్యంలో గురువారం కార్మికులు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదం లేకుండా, పారిశ్రామిక చట్టాలను ఉల్లంఘించి పరిశ్రమను మూసివేసి కార్మికుల బకాయి వేతనాలను చెల్లించకుండా మొండి వైఖరి అవలంబించడం సరికాదన్నారు. కార్మికులకు చట్టపరంగా రావాల్సిన వేతనాలు, గ్రాట్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ లేబర్ కమిషనర్ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలన్నారు. అంతకు ముందు కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేలా పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మహేష్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



సన్యాసమ్మ

పెందుర్తి: పురుషోత్తపురానికి చెందిన సారిపల్లి సన్యాసమ్మ(65) అనే వృద్ధురాలి అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న సన్యాసమ్మ బుధవారం ఉదయం పొలానికి వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయల్దేరింది. ఎంతకీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆమె మనమడు చీర పైడిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ బి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్మయ మిషన్ నూతన భవనం ప్రారంభం

సబ్బవరం: విశ్వవ్యాప్తంగా ఆధ్యాత్మిక, సామాజిక, విద్య, ఆరోగ్య, సేవా రంగాల్లో విస్తృత సేవలందిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ చిన్మయ మిషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం ప్రారంభించారు. 15 ఏళ్లుగా గొల్లలపాలెం వేణుగోపాల స్వామి మందిరం పక్కనే ఉన్న పూరిపాకలో మిషన్ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యా వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీని సేవల్ని మరింత విస్తృతం చేసేలా నూతన భవనాన్ని వివిధ సంస్థల సీఎస్సార్ నిధులతో నిర్మించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. భవన నిర్మాణానికి సహకరించిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హిందుస్తాన్ షిపియార్డ్, పరమేష్ బయోటెక్, మిత్రధాతు నిగమ్, బ్రైత్‌వైట్ అండ్ కో, సరోవర్ హోటల్స్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలు కంపెనీల సీఎండీలు హేమంత్ ఖత్రీ, మాధవరావు, గౌరీ శంకరరావు, యార్లగడ్డ వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

గ్రామాల్లో మౌలిక వసతులకు ఎన్టీపీసీ కృషి



ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కృషి చేస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ అన్నారు. సింహాద్రి హెచ్‌వోపీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్యా, నైపుణ్యాభివృద్ధి పెంపొందించేలా సంస్థ చర్యలు తీసుకుంటోందన్నారు. సంస్థ ద్వారా పరవాడ మండలంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. సమావేశంలో సంస్థ ఏజీఎం హెచ్‌ఆర్ బి.బి.పాత్ర, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ నిరసన

అగనంపూడి: సెల్ టవర్ సిగ్నల్ రేడియేషన్ వల్ల ప్రాణి కోటికి హానికరం ఉందని, సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని 79వ వార్డు శాంతినగర్‌కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. శాంతినగర్ కాలనీలోని ఖాళీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి గతంలో ప్రైవేటు సెల్ కంపెనీ టవర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పట్లో స్థానికులు వ్యతిరేకించడం, అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో గాజువాక తహసీల్దార్ స్థల పరిశీలన చేసి సెల్ టవర్ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అయితే మళ్లీ అదే స్థలంలో మరో కంపెనీకి స్థల యజమాని లీజుకివ్వడంతో సెల్ టవర్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. గోతులు తవ్వడంతో స్థానికులు అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. సెల్ కంపెనీ యాజమాన్యం టవర్ ఏర్పాటు పనులు నిలిపివేయాలని, లేనిపక్షంలో గ్రామస్తులంతా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, గళ్ల రాజు, నాగప్రసాద్, ఎం.గోవిందరావు, టి.శ్రీనివాసరావు, నాగమణి, ఇందల వరలహాలమ్మ, సూర్యకుమారి పాల్గొన్నారు.



సెల్‌టవర్ కోసం తవ్విన గోతులు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బుక్ డిపోకు చేరిన పాఠ్య పుస్తకాలు



బుక్ డిపోలో పేర్చిన పాఠ్యపుస్తకాలు

గాజువాక : ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు స్థానిక బుక్ డిపోనకు గురువారం చేరాయి. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గాను గాజువాక ఆటోనగర్‌లోగల ప్రభుత్వ బుక్ డిపోకు 3,99,153 పాఠ్యపుస్తకాలు చేరాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గల 46 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 38 లక్షలకు పైగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.99 లక్షల పుస్తకాలు ముద్రణా కేంద్రం నుంచి వచ్చినట్టు బుక్ డిపో అధికారులు తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా దశలవారీగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మీరు మారరా..!



ట్రాఫిక్ నియమ నిబంధనలపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా.. ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినా.. ఎంత జరిమానాలు విధించినా.. కొంత మంది వాహన చోదకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా యువత ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలతో రెచ్చిపోతున్నారు. మితిమీరిన వేగం, జిగ్‌జాగ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లతో చెలరేగిపోతున్నారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయం వద్ద హెల్మెట్ ధరించకుండా.. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ.. ఫోన్ మాట్లాడుతూ స్కూటీపై వెళ్తున్న దృశ్యమే ఇందుకు నిదర్శనం.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఉత్కంఠగా ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్



స్టీల్‌ప్లాంట్ మాక్ డ్రిల్‌లో ప్రసంగిస్తున్న డీసీఎఫ్‌ఐ సురేష్



రెస్క్యూ ఆపరేషన్‌లో సీఐఎస్‌ఎఫ్ ఫైర్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ తార్ డిస్టిలేషన్ ప్లాంట్ (టీడీపీ)లో గురువారం నిర్వహించిన ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌ను నిర్ధారించడంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్‌ఐ) వి.సురేష్ సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉదయం టీడీపీ విభాగంలో అగ్ని ప్రమాదం జరిగింది. కార్మికులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీశారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఫిక్స్‌డ్, మొబైల్ ఫైర్ ఫైటింగ్ ఇనస్టాలేషన్లు, వాటర్ కర్టెన్ సిస్టంలు, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ పరికరాలతో సిద్ధమయ్యారు. సీఐఎస్‌ఎఫ్ ఫైర్ వింగ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ప్రమాదంలోని బాధిత వ్యక్తులను సంఘటనా స్థలం నుంచి రక్షించారు. ఇదంతా మాక్ డ్రిల్‌లో భాగంగానే సిబ్బంది నిర్వహించారు. ఆద్యంతం మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పదవీ విరమణ చేయనున్న అధ్యాపకుడు మూర్తిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు జూనియర్లకు మార్గ నిర్దేశకులుగా వారి, వారిని సన్మార్గంలో నడపాలని సూచించారు. కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఆగస్టు నెలలో పదవీ విరమణ చేయనున్న అధ్యాపకుడు వి.ఆర్.ఎల్.మూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ బి.శేషసాయి, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.